

బిరబిరా కృష్ణమ్మ..

ప్రియదర్శిని జూరాల జలాశయానికి గురువారం 1.80 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. 18 గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు.

-8లో ▸



మళ్లీ కనిపించిన చిరుత

పాలమూరుప్రజలను చిరుత బెంబేలెత్తిస్తోంది. ఒకే సీసీ కెమెరాలో 4 సార్లు కనిపించడంతో భయాందోళనకు గురవుతున్నారు.

-8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.7 /20.9

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పంచాయతీ ఓటర్ల జాబితా సిద్ధం

నాగర్‌కర్నూల్: పంచాయతీ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గురువారం నుంచి ఫొటోలతో కూడిన ఓటర్ల ముసాయిదా జాబితాను అధికారులు అందుబాటులో ఉంచారు. జాబితాపై అభ్యంతరాల పరిశీలనకు శుక్రవారం జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెల 30న మండలాల స్థాయిలో ఎంపీడీఓ కార్యాలయాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి అభ్యంతరాలపై చర్చించనున్నారు. సెప్టెంబర్ 2న పంచాయతీల్లో ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తారు. ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం సిద్ధం చేస్తుండటంతో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రూ.9 కోట్లతో నూతన అతిథిగృహం



మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్‌లో రూ.9 కోట్లతో గెస్టు హౌస్ (విశ్రాంతి భవనం) నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో ఉన్న మన్ననూర్‌కు తరచుగా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు రాకపోకలు చేస్తుంటారన్నారు. ఈ క్రమంలో మన్ననూర్‌లో గెస్టు హౌజ్ లేకపోవడం కొంత ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి విషయం చెప్పానన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించడమే కాక తక్షణమే నూతన భవణం నిర్మాణానికి గానూ రూ.9 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసేందుకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేష్, మాజీ జెడ్పీటీసీ మంత్రియ నాయక్ తదితరులు ఉన్నారు.

బాధలు వినండయ్యా..

యూరియా కోసం జిల్లాలోని పీఏసీఎస్‌ల వద్ద రైతులు బారులు



'జిల్లాలోని కల్వకుర్తి పట్టణంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం వద్ద బారులు తీరి ఉన్న రైతుల పరిస్థితి ఇది. వానాకాలం సీజన్ సగం పూర్తి కావస్తున్నా వరి పంట పిలకల దశలో వేసేందుకు యూరియా అందుబాటులో లేకపోవడంతో పది రోజులుగా ఈ కేంద్రంలో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. గురువారం యూరియా పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో ఉదయం 9 గంటల నుంచే రైతులు బారులు తీరారు. మండలంలోని సుమారు 200 మందికి పైగా రైతులు యూరియా కోసం లైన్‌లో నిల్చొని ఇబ్బందులు పడ్డారు. ఒక్కొక్కరికీ రెండు బస్తాల యూరియా మాత్రమే ఇవ్వగా.. సరిపడా యూరియా పంపిణీ చేయాలని ఆందోళన వ్యక్తం చేశారు.'

- వెల్దండలో లారీ లోడ్ కోసం 200 మంది రైతుల నిరీక్షణ
- వర్షంలోనూ తప్పని ఎదురుచూపులు
- అధిక వినియోగం, ఒకేసారి వరినాట్లతో డిమాండ్

జిల్లాలో యూరియా నిల్వలు	
అవసరమైన ఎరువులు - 34,942 టన్నులు	జిల్లాలో ఇప్పటివరకు వచ్చిన యూరియా - 20,336 టన్నులు
రైతులకు సరఫరా చేసినవి - 17,824 టన్నులు	ప్రస్తుతం నిల్వ ఉన్నవి - 2,512 టన్నులు
ఈ సీజన్‌లో ఇంకా అవసరమైనవి - 14,606 టన్నులు	

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల ఎదుట బారులు తీరి గంటల తరబడి యూరియా కోసం నిరీక్షించినా అధికారులు ఒక్కొక్కరికి రెండు బస్తాలను మాత్రమే విక్రయిస్తున్నారు. యూరియా కొరత నేపథ్యంలో తమ పంటను కాపాడుకునేందుకు రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం సైతం జిల్లాలోని వెల్దండ, కల్వకుర్తి, అచ్చంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల ఎదుట యూరియా కోసం నిరీక్షిస్తూ రైతులు బారులు తీరడం కనిపించింది. సాగుచేస్తున్న పంట విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఒక్కో రైతుకు రెండేసి బస్తాలే ఇస్తుండటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వెల్దండ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ముందు యూరియా కోసం బారులు తీరిన రైతులు

5 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో ఈ సారి వరి, మొక్కజొన్న, పత్తి పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని అధికారులు అంచనా వేశారు. మొత్తం వ్యవసాయ సాగు విస్తీర్ణం సుమారు 5 లక్షల ఎకరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు పీఏసీఎస్‌ల పరిధిలో యూరియాకు ఎక్కువ డిమాండ్ నెలకొంది. ఆయా చోట్ల నిల్వలు అడుగంటకముందే అధికారులు అప్రమత్తమై సరిపడా స్టాక్‌ను అందుబాటులో ఉంచాల్సి ఉండగా, రోజుల తరబడి స్టాక్ తెప్పించడం లేదు. ఫలితంగా జిల్లాలోని కల్వకుర్తి, వెల్దండ, అచ్చంపేట తదితర మండలాల్లో యూరియా సరఫరా లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధిక వినియోగం, నిల్వతో డిమాండ్

జిల్లాలో యూరియాకు ఒక్కసారిగా డిమాండ్ పెరగడం, అందుకు తగినంత సరఫరా లేకపోవడంతో పలుచోట్ల కొరత ఏర్పడుతోంది. వరి నాట్లు పూర్తయిన తర్వాత పిలకల దశంలో పైరు ఎదుగుదల కోసం రైతులు విస్తృతంగా యూరియాను వినియోగిస్తున్నారు. రైతులు అవసరానికి మించి పంటలకు ఎక్కువగా యూరియా వినియోగించడం, కొరతగా ఉందన్న కారణంతో చాలామంది రైతులు ఎక్కువ బస్తాలను ముందుగానే స్టాక్ చేసి పెట్టుకోవడంతో కృత్రిమంగా కొరత తలెత్తుతోందని అధికారులు అంటున్నారు. జిల్లాలోని డీలర్లు కృత్రిమ కొరత సృష్టించకుండా ఎప్పటికప్పుడు దుకాణాల్లో నిల్వలను పర్యవేక్షిస్తున్నామని చెబుతున్నారు.

రెండు బస్తాలే ఇస్తున్నారు..



నేను రెండు ఎకరాల్లో వరి, మరో నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఉదయం 8 గంటల నుంచే వెల్దండ ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం వద్ద లైన్‌లో నిల్చున్నా. ఒక్కరికి రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. లారీ లోడు వచ్చిన గంటలోపే అయిపోయింది. సరిపడా యూరియా ఇచ్చి ఇబ్బందులు తొలగించాలి.

– జంగయ్య, రైతు, చెరుకూర్, వెల్దండ మండలం

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు..

జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా నిల్వలను అందుబాటులో ఉంచాం. ఈసారి జిల్లాలో మొత్తం 5 లక్షల ఎకరాల విస్తీర్ణం పెరిగే అవకాశం ఉండటంతో అదనపు యూరియా కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. ఎవరైనా ఎమ్మార్పీకి మించి యూరియా అమ్మినా, కృత్రిమంగా కొరత సృష్టించినా చర్యలు తీసుకుంటాం.

– యశ్వంత్‌రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

విద్యాధికారుల నిర్లక్ష్యంపై అసహనం



విద్యాశాఖ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్ కర్నూల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. గురువారం డీఈఓ రమేష్‌కుమార్‌తో కలిసి ఎంఈఓలు, క్లస్టర్ హెచ్ఎంలతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యా శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పాఠశాలలపై ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ నామమాత్రంగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. నెలలో ఎంఈఓ 20 పాఠశాలలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు 12 పాఠశాలలు పర్యవేక్షించి తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో పొందుపరచాల్సి ఉండగా.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, యూడైస్ విద్యార్థుల వివరాల నమోదు ప్రక్రియ ఆశించిన స్థాయిలో లేదన్నారు. కేవలం తాడూరు, పెద్దకొత్తపల్లి మండలాల్లోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తరగతులు సమర్థవంతంగా కొనసాగుతున్నాయన్నారు.

డిజిటల్ పద్ధతిలో బోధన

తెలకపల్లి: డిజిటల్ పద్ధతిలో విద్యార్థులకు బోధించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం కారువంగ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠాలు బోధించారు. చిన్న చిన్న ఉదహారణలతో గణితాన్ని బోధించడం ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమవుతుందన్నారు.

జిల్లావ్యాప్తంగా..

విద్యార్థుల యూడైస్ నమోదుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో చదువుతున్న 1,28,973 మంది విద్యార్థులకు గాను ఇప్పటివరకు 1,24,888 మంది విద్యార్థుల నమోదు ప్రక్రియను పూర్తి చేయగా 4,085 మంది విద్యార్థుల నమోదు ప్రక్రియను ఇంకా చేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు జిల్లాలో 22 పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ విధానం ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో 21 పాఠశాలల్లో నూతనంగా ప్రారంభించనున్న ప్రీ ప్రైమరీ తరగతులను అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేసి విద్యార్థులను ఆకర్శించే స్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి నెల చివరి గురువారం విద్యాశాఖపై సమీక్ష ఉంటుందని, వచ్చే సమీక్ష నాటికి మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో నోడల్ అధికారి కురుమయ్య, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, ఏసీ రాజశేఖర్‌రావు, సెక్టోరల్ అధికారులు నూరుద్దీన్, శోభారాణి, మురళీధర్‌రెడ్డి, టెస్ట్ బుక్ మేనేజర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



గణనాథుడికి పూజలు చేస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం: వినాయక చవితి ఉత్సవాలను జిల్లా ప్రజలు ప్రశాతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓల్డ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ గణేష్ ఉత్సవాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పూజలో సీఐ అశోక్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వసతులున్నా.. ఆటలు అంతంతే!



ఒక్క కోచ్ కూడా లేని అచ్చంపేటలోని మినీ స్టేడియం

- ఉమ్మడి జిల్లాలో క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు గురువులు కరువు
- కోచ్‌లు లేక వెలవెలబోతున్న మైదానాలు
- కొత్త క్రీడాపాలసీలో శిక్షకుల నియామకాలపై ఆశలు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాలో క్రీడారంగాన్ని కోచ్‌ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. అన్ని జిల్లాల్లో మైదానాలు ఉన్నప్పటికీ కోచ్‌లు లేకపోవడంతో ఔత్సాహిక క్రీడాకారులు శిక్షణకు దూరమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొందరు పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు తమకున్న ఆసక్తితో క్రీడాకారులకు స్వచ్ఛందంగా శిక్షణనిస్తున్నారు. కాని కోచ్‌లు లేకపోవడంతో చాలా క్రీడల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు వెనుకబడుతున్నారు.

■ మహబూబ్‌నగర్‌లోని ప్రధాన స్టేడియం ఉమ్మడి జిల్లాకే తలమానికం. ఇంత గతంలో కోచ్‌లతో కళకళలాడిన ఈ స్టేడియం ప్రస్తుతం నలుగురు కోచ్‌లతోనే నెట్టుకొస్తున్నారు. 18 ఏళ్లుగా కోచ్‌ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. కేవలం అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, స్విమ్మింగ్ కోచ్‌లు మాత్రమే ఉన్నారు. వేసవి సెలవుల్లో స్విమ్మింగ్ కోచ్ శిక్షణ ఇస్తారు. ఖేలో ఇండియా ఫుట్‌బాల్ కోచ్ ఉండగా ఇండోర్ స్టేడియంలో పే అండ్ ప్లే పద్ధతిలో బ్యాడ్మింటన్ కోచ్ మాత్రమే ఉన్నారు. మిగతా క్రీడలకు శిక్షకులు లేకపోవడంతో ఔత్సాహిక క్రీడాకారులు నిరాశకు గురవుతున్నారు. కబడ్డీ, హాకీ, ఖో–ఖో, హ్యాండ్‌బాల్, ఇండోర్‌లో బాక్సింగ్, జూడో, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడలకు కోచ్‌ల అవసరం ఉంది.

■ 2007 నుంచి స్టేడియంలలో శాశ్వత పద్ధతిన కోచ్‌ల నియామకం చేపట్టలేదు. ఇప్పుడున్న కోచ్‌లు కూడా తాత్కాలిక పద్ధతిన పని చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా యువజన, క్రీడాశాఖ పరిధిలో జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంతో పాటు మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, ఎంవీఎస్ కళాశాలలోని ఇండోర్ స్టేడియం, జడ్చర్లలోని మినీ స్టేడియం, సీసీకుంట అల్లీపూర్, భూత్పూర్ మండలం పోతులమడుగులో మినీ ఇండోర్ స్టేడియంలు ఉన్నాయి. మెయిన్ స్టేడియంలో ఐదుగురు, అల్లీపూర్‌లో కబడ్డీ కోచ్ మాత్రమే ఉన్నారు.

■ వనపర్తిలో ఒక క్రీడా ప్రాంగణం, మరో ఇండోర్ స్టేడియం ఉండగా ఒక్క కోచ్ కూడా లేరు. హాకీ అకాడమీలో ఇద్దరు కోచ్‌లు ఉన్నారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్, అచ్చంపేటలో మినీ స్టేడియంలు, కల్వకుర్తిలో ఇండోర్ స్టేడియం ఉన్నాయి. కొల్లాపూర్‌కు ఇటీవల అథ్లెటిక్స్ కోచ్ రాగా కల్వకుర్తిలో ఫుట్‌బాల్ కోచ్, ఖేలో ఇండియా కబడ్డీ కోచ్ ఉన్నారు.

■ నారాయణపేట జిల్లా మక్తల్‌లో స్టేడియం ఉండగా ఒక్క కోచ్ లేరు. ధన్వాడలో ఒక రెజ్లింగ్ కోచ్, నారాయణపేటలో ఖేలో ఇండియా అథ్లెటిక్స్ కోచ్ ఉన్నారు.

■ గద్వాలలో స్టేడియం, ఇండోర్ స్టేడియం, ఎర్రవల్లి చౌరస్తాలో ఇండోర్ స్టేడియం ఉన్నాయి. గద్వాలలో ఖేలో ఇండియా ఫుట్‌బాల్ కోచ్ మాత్రమే ఉన్నారు. అయితే ఉమ్మడి జిల్లాలోని చాలా మైదానాల్లో వాచ్‌మెన్‌లు కూడా లేని పరిస్థితి నెలకొంది.

నిధుల కొరత..

యువజన, క్రీడాశాఖలు నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయి. 2006 వరకు వార్షిక నిర్వహణ పేరిట అప్పటి రాష్ట్ర ప్రభుత్వం డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీలకు రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు నిధులు మంజూరు చేసేది. ఈ నిధులతో క్రీడల నిర్వహణ, క్రీడాసంఘాలకు ఆర్థికసాయంతో పాటు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులకు టీఏ, డీఏలు చెల్లించేవారు. కాని ప్రస్తుతం నిధులు విడుదల చేసిన దాఖలాలు లేవు. వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ఆయా జిల్లాల్లో ప్రత్యేక క్రీడాశాఖలు ఏర్పాటు చేసినా నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్నా యి. నూతన క్రీడాపాలసీలో కోచ్‌ల నియామకంతో పాటు క్రీడాశాఖలను బలోపేతం చేయాలని సీనియర్ క్రీడాకారులు కోరుతున్నారు.

హ్యాండ్‌బాల్ కోచ్‌ను నియమించాలి..



ప్రధాన స్టేడియంలో 1997 నుంచి 2006 వరకు రవికుమార్ హ్యాండ్‌బాల్ కోచ్‌గా పనిచేసినప్పుడు ఎందరో క్రీడాకారులు వెలుగులోకి వచ్చారు. అనంతరం నేను 2009 వరకు కోచ్‌గా పనిచేసి అనివార్య కారణాలతో మానేశాను. తర్వాత కోచ్ నియామకం చేపట్టలేదు. అయినా క్రీడపై ఉన్న ఆసక్తితో ఇప్పటికీ శిక్షణనిస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి శాశ్వత పద్ధతిన కోచ్‌ను నియమిస్తే మరింత మంది క్రీడాకారులను తయారు చేయవచ్చు.

– ఎండీ జియాఫుద్దీన్, సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు, మహబూబ్‌నగర్

ప్రతిపాదనలు పంపించాం..



కోచ్‌ల నియామకంపై ఇదివరకే ప్రతిపాదనలు పంపించాం. నూతన క్రీ డాపాలసీతో ఔత్సాహిక క్రీడాకారులకు మేలు జరగనుంది. స్టేడియంలలో కోచ్‌ల నియామకం జరిగే అవకాశం ఉంది. క్రీడా శిక్షణతో నైపుణ్యంగల క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. గ్రామీణస్థాయి నుంచి క్రీడలను అభివృద్ధి చేసుకోవచ్చు.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్

దరఖాస్తుల ఆహ్వానం

కందనూలు: జిల్లాలో నూతనంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ పాఠశాలలకు ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు ఇంటర్ పాసై ఉండి, ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్ చదివిన వారు అర్హులని, ఆయా పోస్టులకు కనీసం 7వ తరగతి చదివి ఉండాలని తెలిపారు. గ్రామ పంచాయతీ, మండలం, జిల్లా పరిధిలోని అభ్యర్థులు ఈ నెల 29వ తేదీ నుంచి సెప్టెంబర్ 1 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారం http:/doenagarkurnool.weeby.com/ నందు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

సాదాబైనామాలకు మోక్షం

జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో 8,167 దరఖాస్తులు



- క్రమబద్ధీకరణకు అనుమతిచ్చిన కోర్టు
- 'భూభారతి' ద్వారా పట్టాలు
- దరఖాస్తుదారుల ఎదురుచూపులకు తెర
- సన్న, చిన్నకారు రైతులకు మేలు

అచ్చంపేట: తెల్లకాగితంపై లిఖితపూర్వక ఒప్పందాలతో కొనుగోలు చేసిన భూముల రిజిస్ట్రేషన్లకు అడ్డంకి తొలగడంతో వేలాది మంది రైతులకు మేలు జరగనుంది. ప్రభుత్వం 2020 అక్టోబరు 12న జారీ చేసిన జీఓ నంబరు 112ను సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం విధితమే. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు ఈ నెల 26న తీర్పు వెల్లడించడిస్తూ సన్న, చిన్నకారు రైతులకు తీపికబురు అందించింది. 2014 జూన్ 2కు ముందు తమ ఆధీనంలో ఉన్నట్లు చూపిన సన్నకారు రైతులకు భూముల క్రమబద్ధీకరణకు అవకాశం ఇస్తున్నట్లు కోర్టు తెలిపింది. 2020 అక్టోబరు నుంచి 2020 నవంబరు 10 వరకు తెలంగాణ భూమి హక్కులు, పట్టాదారు పాస్‌బుక్స్ చట్టం–1971 ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికి క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఈప్రక్రియ పూర్తయ్యే సరికి సుమారుగా ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

ఆర్ఓఆర్ చట్టంతో..

గ్రామీణ ప్రాంతాల్లో కొన్నేళ్ల కిందట సాదా కాగితంపై భూమి కొనుగోలు చేసి రాయించుకున్న వారిలో అనేక మంది పేర్లు మార్చుకొని పట్టాలు చేసుకోలేదు. ధరణికి ముందున్న ఆర్ఓఆర్ చట్టంతో సాదాబైనామాలతో పట్టాలు చేశారు. ధరణి వచ్చిన తర్వాత అవి ఆగిపోయాయి. అయితే వాటిని అమలు చేసేందుకు గత ప్రభుత్వం సాదాబైనామాలను క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. 2014 జూన్ 2 లోగా లిఖితపూర్వక ఒప్పందంతో భూములు కొన్న రైతుల దరఖాస్తులకు చట్టబద్ధత కల్పించి పాసుపుస్తకాలు జారీచేయాలని భావించింది. 2020 అక్టోబరులో ప్రకటన వెలువరించి నవంబరు10 వరకు దరఖాస్తులు స్వీకరించగా.. నాగర్‌కర్నూలు జిల్లాలో 8,167 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ధరణి రాకతో బేజారు..

బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో ధరణి పోర్టల్ తీసుకొచ్చి దాని ద్వారానే భూనిర్వహణ కొనసాగించింది. ధరణిలో సాదాబైనామా దరఖాస్తులకు సంబంధించి రిజిస్ట్రేషన్ల కోసం కాలమ్ లేకపోవడంతో చాలా మంది రైతులు ఇబ్బందులు పడ్డారు. కానీ సాదాబైనామా సమస్యలు పరిష్కరించడంలో గత ప్రభుత్వం జాప్యం చేసింది. దీంతో అప్పట్లో భూదస్త్రాల్లోని పట్టాభూములు విక్రయించిన వారి పేర్ల మీదనే కొత్త పట్టా పుస్తకాలు వచ్చాయి. గతంలో వారి పూర్వీకులు విక్రయించిన భూముల పాసుపుస్తకాలు వారసులకు రావడంతో ఆ పొలాలు తమవేనని కబ్జా పెడుతున్నారు. సాదాబైనామా భూముల వివాదాలకు ధరణి కేంద్ర బిందువైంది.

పరిష్కారం లభించినట్లే..

❒ సాదాబైనామా పత్రాలు చట్టపరంగా ధ్రువీకరించినవి కాకపోవడంతో సదరు భూమి మీద హక్కులను రుజువు చేసుకోవటం రైతులకు కష్టంగా మారుతుంది.

❒ సాదాబైనామా భూములపై పూర్వపు యజమానులు లేదా వారి వారసులు హక్కు కలిగి ఉన్నట్లు కేసులు వేస్తే వాటిని ఎదర్కోవాల్సి వస్తోంది.

❒ భూ క్రయ విక్రయాలకు చట్టపరమైన సమస్యలు ఎదురవుతున్నాయి.

❒ పట్టా లేకపోవడం వల్ల రాయితీలు, బ్యాంకు రుణాలు అందటం లేదు.

❒ భూమి అసలు యజమాని ఎవరో తెలుసుకోవటం కష్టమవటంతో సదరు భూముల హక్కుల కోసం వివాదాలు ఎదరువుతున్నాయి. ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత ఆర్డీఓ ద్వారా నోటీసులు జారీ చేస్తారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చుట్టు పక్కల ఉన్న రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతారు. సదరు భూమిని అమ్మింది, కొన్నది వాస్తవమే అన్ని తేలితే ప్రత్యేక ఆర్డర్ ఇచ్చి రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీ కట్టించుకుని క్రమబద్ధీకరణ అవకాశం కల్పిస్తారు.

జీఓ ప్రకారం..



రాష్ట్ర ప్రభుత్వం భూభారతి పోర్టల్ తీసుకొచ్చిన తర్వాత సాదాబైనామాలపై చాలా సార్లు చర్చ జరిగింది. సాదాబైనామాల పరిష్కారం కోసం ధరణి చట్టంలో నిబంధనను పొందుపర్చలేదు. రెవెన్యూ పక్షాళనకు కొత్తగా 2024లో తెచ్చిన భూభారతి చట్టంలో ఈ నిబంధన తీసుకొచ్చారు. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్య ఇప్పుడు పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. దీని వల్ల చాలా మంది సన్న, చిన్నకారు రైతులకు ఎంతో మేలు జరగనుంది.

– కె.మాధవి, ఆర్డీఓ, అచ్చంపేట

సాదాబైనామాల దరఖాస్తుల సమాచారం	
అచ్చంపేట	207
అమ్రాబాద్	77
బల్మూర్	270
బిజినేపల్లి	607
చారకొండ	304
కల్వకుర్తి	149
కోడేరు	1,364
కొల్లాపూర్	572
లింగాల	236
నాగర్‌కర్నూల్	416
పదర	62
పెద్దకొత్తపల్లి	1,360
పెంట్లవెల్లి	310
తాడూరు	182
తెలకపల్లి	433
తిమ్మాజిపేట	330
ఉప్పునుంతల	346
ఊర్కొండ	69
వంగూరు	488
వెల్దండ	385
మొత్తం	8,167

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికుడు మృతి


బసిరెడ్డి యాదగిరి(ఫైల్)

నవాబుపేట: రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికుడు మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కూచూర్ గ్రామానికి చెందిన మాజీ సైనికుడు బసిరెడ్డి యాదగిరి(45) రెండేళ్ల క్రితం పదవీ విరమణ చేశాడు. అనంతరం ఆయన బెంగళూర్‌లో డిఫెన్స్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. వినాయక చవితికి స్వగ్రామం కూచూర్‌కు వచ్చాడు. బుధవారం పూజలు ముగించుకుని జిల్లా కేంద్రానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గ్రామ సమీపంలో హస్నసానిపల్లి గ్రామం దగ్గర ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో మాజీ సైనికుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. యాదగిరి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ఓ యువతి అనుమానాస్పద స్థితిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. మండల పరిధిలోని శ్రీపురం గ్రామానికి చెందిన పార్వతమ్మ తన కూతురు అనురాధ (19)తో కలిసి జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులో అద్దె ఇంట్లో నివాసం ఉంటుంది. అయితే పార్వతమ్మ గురువారం పొలానికి వెళ్లగా అనురాధ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పార్వతమ్మ కూతురుకు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో పక్కింటి వారికి చెప్పడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించి తల్లికి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

బిజినేపల్లి: మండలంలోని గుడ్లనర్వకు చెందిన గణేష్ (34) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దుర్ఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గణేష్ బిజినేపల్లి మండల కేంద్రంలోని నందివడ్డెమాన్ కమ్మాన్ వద్ద ఫుట్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం దుకాణం లోపలె ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పలువురు అనుమానిస్తున్నారు. గణేష్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మన్ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మన్ మృతి చెందిన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకద్ర మండలం చిన్న రాజమూరు గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ (29) పట్టణంలో విద్యుత్ శాఖ సెక్షన్-1 వన్‌టౌన్ పరిధిలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి తర్వాత కురిహిశెట్టి కాలనీ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం రావడంతో మరమ్మతు చేయడానికి వెళ్లిన జూనియర్ లైన్‌మెన్ అరుణ్‌కుమార్‌కు విద్యుత్ షాక్ తగలడంతో ఇతర సిబ్బంది చికిత్స జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. అరుణ్‌కుమార్‌కు ఇటీవల పెళ్లి నిశ్చయం కావడంతో త్వరలో పెళ్లి పీటలు ఎక్కాల్సిన సమయంలో మృత్యువాతపడటంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మోటారు ఆన్ చేసేందుకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..

భూత్పూర్: విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతులమడుగు గ్రామానికి చెందిన కొత్త తెలుగు చెన్నయ్య (69)ప్రతి రోజు మాదిరిగా వరిపంటకు నీరు పెట్టడానికి వెళ్లాడు. స్టాటర్ డబ్బా డోర్ తెరిచే క్రమంలో కరెంట్ పోల్ నుంచి డబ్బాకు వచ్చే సర్వీస్ వైరు తేలి ఉండటంతో చేతికి తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీన్ని గమనించిన పక్క పొలం వారు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. చెన్నయ్య కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రీడా రత్నాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి పాలమూరు క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు అంతర్జాతీయ వేదికపై ఆడి జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకొచ్చారు. నేడు (శుక్రవారం) జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా పలువురు క్రీడాకారుల గురించి ప్రత్యేక కథనం..

- అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటుతున్న పాలమూరు క్రీడాకారులు
- వాలీబాల్, సాఫ్ట్‌బాల్, నెట్‌బాల్‌లో రాణింపు
- పలువురు భారత జట్టుకు ప్రాతినిధ్యం.. మరొకరు కోచ్‌గా సేవలు
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం



బీచ్ హ్యాండ్‌బాల్‌లో బెస్ట్ అటాకర్ ఆసిఫుల్లాబేగ్..



భూత్పూర్ మండలం తాటికొండకు చెందిన ఆసిఫుల్లాబేగ్ హ్యాండ్‌బాల్‌లో విశేషంగా రాణిస్తున్నాడు. అటాకర్‌గా ఆడుతున్న ఆసిఫుల్లాబేగ్ ఇప్పటివరకు 35 రాష్ట్రస్థాయి, 5 జాతీయ స్థాయి టోర్నీల్లో పాల్గొని ప్రతిభచాటాడు. ముఖ్యంగా బీచ్ హ్యాండ్‌బాల్‌లో రాణిస్తున్న ఆసిఫుల్లా న్యూఢిల్లీలో జరిగిన భారత బీచ్ హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొన్నాడు. ఏప్రిల్ 21 నుంచి 30 వరకు న్యూఢిల్లీలో జరిగిన భారత హ్యాండ్‌బాల్ జట్టు శిక్షణ శిబిరంలో పాల్గొన్న 15 మందిలో తెలంగాణ నుంచి ఇద్దరు కాగా వారిలో ఆసిఫుల్లా ఒకరు. మే 6 నుంచి 15 వరకు ఒమన్ దేశం మస్కట్‌లో జరిగిన ఏషియనల్ బీచ్ హ్యాండ్‌బాల్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. భవిష్యత్తులో క్రీడాకోటాలో ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆసిఫుల్లాబేగ్ పేర్కొన్నాడు.

సాఫ్ట్‌బాల్‌లో కిరణ్‌కుమార్ సత్తా



మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం రాణిపేట గ్రామానికి చెందిన జక్కా కిరణ్‌కుమార్ సాఫ్ట్‌బాల్‌లో విశేష ప్రతిభ కనబరుస్తున్నాడు. కిరణ్‌కుమార్ గత 11 ఏళ్ల నుంచి రాణిస్తున్నాడు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో జిల్లా, రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాడు. జిల్లా జట్టుకు పలు సార్లు కెప్టెన్‌గా వ్యవహరించాడు. వివిధ విభాగాల పోటీల్లో ఇప్పటివరకు నాలుగుసార్లు బంగారు, రెండు రజత, రెండు కాంస్య పతకాలు సాధించాడు. కిరణ్‌కుమార్ దాదాపు 20 సార్లు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాడు. 2016 సంవత్సరంలో ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రం దుర్గ్‌లో జరిగిన జాతీయస్థాయి నేషనల్, 2017లో హైదరాబాద్, ఛత్తీస్‌ఘఢ్ దుర్గ్, 2018 గుజరాత్‌లో జరిగిన జూనియర్ నేషనల్, 2022లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్‌లో జరిగిన జాతీయ సీనియర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూర్‌లో జరిగిన సీనియర్ సౌత్ జోన్ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 2023 సంవత్సరంలో జమ్ముకాశ్మీర్ (జమ్ము)లో జరిగిన సీనియర్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. తమిళనాడు రాష్ట్రం సేలంలో జరిగిన ఆలిండియా ఇంటర్ జోనల్ నేషనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించాడు.

బ్యాంకాక్ టోర్నీలో భారతజట్టుకు ప్రాతినిధ్యం

థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఈ ఏడాది జూన్ 2 నుంచి 5వరకు జరిగిన 2వ అండర్-23 పురుషుల సాఫ్ట్‌బాల్ ఏషియా కప్ 2025లో కిరణ్‌కుమార్ భారతజట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. బ్యాంకాక్‌లో జరిగిన ఏషియా కప్‌లో కిరణ్‌కుమార్ ఐదు మ్యాచులకుగాను హంకాంగ్-చైనా, సింగపూర్, థాయిలాండ్ జట్లతో భారత జట్టు తరఫున ఆడాడు. ఒలింపిక్స్‌లో దేశం తరఫున ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కిరణ్‌కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశాడు.

వాలీబాల్‌లో అనన్యశ్రీ రాణింపు



ఉమ్మడి జిల్లాలోని మక్తల్‌కు చెందిన అనన్యశ్రీ వాలీబాల్‌లో అంచలంచెలుగా ఎదుగుతూ అంతర్జాతీయస్థాయికి ఎదిగింది. 2018లో అప్పటి జిల్లా యువజన, క్రీడల అధికారిణి సత్యవాణి ఆధ్వర్యంలో పొడగరి బాలికల క్రీడా నైపుణ్య కార్యక్రమం నిర్వహించగా 180 సెంటీమీటర్లు ఎత్తుగా ఉన్న అనన్యశ్రీ వాలీబాల్ క్రీడకు ఎంపికైంది. సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన వాలీబాల్ అకాడమీ ప్రవేశ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచింది. 2019లో ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా అథ్లెట్ పథకం కింద కేరళలోని పట్టణమిట్టలోగల వాలీబాల్ అకాడమీకి అనన్యశ్రీ ఎంపికై 2024 ఆగస్టు వరకు శిక్షణ తీసుకుంది. గత ఏడాది క్రీడా కోటా కింద పూణేలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ఉద్యోగం సాధించింది. మూడు సార్లు తెలంగాణ జట్టుకు, పలుసార్లు కేరళ రాష్ట్ర వాలీబాల్ జట్లకు ప్రాతినిధ్యం వహించింది. 2023 అస్సాం రాష్ట్రం గౌవహాటిలో జరిగిన 71వ ఉమెన్ సీనియర్ నేషనల్ వాలీబాల్ పోటీలకు కేరళ రాష్ట్ర జట్టుకు అనన్యశ్రీ ప్రాతినిధ్యం వహించింది. సీనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో కేరళ మహిళా జట్టు విజేతగా నిలవడంతో అనన్యశ్రీ బంగారు పతకం సాధించింది. పాండిచ్చేరిలో జరిగిన ఫెడరేషన్ కప్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనగా కేరళ రాష్ట్ర జట్టు రన్నరప్‌గా నిలిచింది.

రెండు సార్లు అంతర్జాతీయ పోటీల్లో

అనన్యశ్రీ రెండుసార్లు అంతర్జాతీయ వాలీబాల్ పోటీల్లో పాల్గొంది. చైనా దేశం చెంగ్డు నగరంలో 2023 ఆగస్టులో జరిగిన 'వరల్డ్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్'లో కేరళ యూనివర్సిటీ జట్టు తరఫున పాల్గొంది. వియాత్నం దేశం హనోయిలో ఈ ఏడాది జూన్ 7 నుంచి 14 వరకు జరిగిన ఆసియా వాలీబాల్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో ఆడాలన్నదే తన లక్ష్యమంటోంది అనన్యశ్రీ.

నెట్‌బాల్‌లో విక్రమ్ ఆదిత్యరెడ్డి ప్రతిభ

తాను ఇష్టపడిన క్రీడలపై ఆసక్తి కనబరుస్తూ ఒక క్రీడాకారుడిగా, కోచ్‌తోపాటు అదే క్రీడకు రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతూ ఇలా ఒక క్రీడలో మూడు విభాగాల్లో తన ప్రాతినిధ్యంతో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాడు మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడకు చెందిన విక్రమ్ ఆదిత్యరెడ్డి. ఈయన 2003లో నెట్‌బాల్ ప్రయాణాన్ని ప్రారంభించారు. 2004 హైదరాబాద్‌లో నిర్వహించిన సబ్ జూనియర్ జాతీయ చాంపియన్‌షిప్‌లో మొదటి జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా దాదాపు 35 జాతీయస్థాయి టోర్నమెంట్‌లలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాడు.

భారత మహిళా జట్లకు కోచ్‌గా సేవలు

విక్రమ్ ఆదిత్యరెడ్డి నెట్‌బాల్‌లో క్రీడాకారుడిగా ఆడుతూనే మరో పక్క భారత మహిళా జట్లకు పలుసార్లు కోచ్‌గా సేవలు అందించడం విశేషం. కోచ్‌గా క్వాలిఫై కావడానికి సింగపూర్‌లో 2021 నుంచి ఈ ఏడాది వరకు ఏషియన్ కోచింగ్ కోర్సును పూర్తిచేసి లెవల్-3 కోచ్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఇప్పటివరకు నాలుగుసార్లు అంతర్జాతీయ నెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న భారత మహిళా జట్లకు కోచ్‌గా వ్యవహరించారు. 2022లో సింగపూర్‌లో జరిగిన ఏషియా మహిళల నెట్‌బాల్ చాంపియన్‌షిప్, 2024లో బెంగుళూర్‌లో జరిగిన ఆసియా నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా జట్లకు కోచ్‌గా ఉన్నారు. అదే విధంగా ఈ ఏడాది జూన్‌లో హంకాంగ్‌లో నిర్వహించిన బౌహినియా కప్‌లో, దక్షిణా కొరియా జియోంజోలో జరిగిన ఏషియన్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హెడ్ కోచ్‌గా వ్యవహరించి జట్టును ముందుకు నడిపించారు. హంకాంగ్‌లో టోర్నీలో ఇండియన్ మహిళా జట్టు మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. నెట్‌బాల్ క్రీడపై ఉన్న ఆసక్తితో, క్రీడను రాష్ట్రంలో క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలనే సంకల్పంతో విక్రమ్ ఆదిత్యరెడ్డి నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణకు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.



బిరబిరా కృష్ణమ్మ.. పరుగులు


శ్రీశైలం జలాశయం

ధరూరు/ఆత్మకూరు/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఎగువ నుంచి 1.80 లక్షల క్యూసెక్కుల వరద చేరినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో 18 క్రస్ట్ గేట్లను పైకెత్తి 1,48,323 క్యూసెక్కులు దిగువకు వదిలారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 34,559 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 46, నెట్టెంపాడుకు 750, ఎడమ కాల్వకు 390, కుడి కాల్వకు 680 క్యూసెక్కులు వినియోగించినట్లు అధికారులు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 5.609 టీఎంసీలు ఉన్నట్లు వివరించారు.

■ జూరాల ఎగువ విద్యుత్ కేంద్రంలోని 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 254.863 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 286.458 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 541.321 మి.యూ. చేపట్టామన్నారు.

■ శ్రీశైలం జలాశయానికి గురువారం జూరాల, సుంకేసుల నుంచి 1,94,577 క్యూసెక్కుల వరద చేరగా.. 9 గేట్లు ఒక్కొక్కటి పది అడుగుల మేర ఎత్తి 2,23,119 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,305 క్యూసెక్కులు అదనంగా దిగువకు చేరుతోంది. ప్రస్తుతం జలాశయంలో 882.0 అడుగుల నీటిమట్టం, 198.8120 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో 16.801 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 13.296 మి.యూ. విద్యుదుత్పత్తి చేశారు.

11 వేల క్యూసెక్కులు విడుదల..

మదనాపురం: మండలంలోని సరళాసాగర్ జలాశయం నుంచి గురువారం 11,320 క్యూసెక్కుల నీరు దిగువకు వదిలారు. ఎగువ నుంచి వరద రావడంతో 3 ఉడ్ సైఫాన్లు, 2 ప్రైమరీ సైఫాన్లు తెరుచుకున్నాయి. దీంతో మదనాపురం చిన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

జూరాల 18, శ్రీశైలం 9 గేట్లు ఎత్తివేత

కోయిల్‌సాగర్ ఒక గేట్ ఎత్తి..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ జలాశయానికి బుధవారం భారీగా వరద రావడంతో 3 గేట్లు తెరువగా గురువారం ఉదయం తగ్గడంతో రెండు మూసి ఒక గేటు ద్వారా దిగువకు నీటి విడుదల చేసినట్లు అధికారులు వివరించారు. ఎగువ నుంచి వస్తున్న వరదకు అనుగుణంగా నీటి విడుదల చేపడుతున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. ప్రస్తుతం 32 అడుగులు ఉందన్నారు.

■ సరళాసాగర్, శంకర సముద్రం నీరు రావడంతో మదనాపురం వద్ద ఉన్న కాజ్‌వే నీట మునిగింది. దీంతో ఆత్మకూర్, కొత్తకోట, అమరచింత, చిన్నచింతకుంట, వనపర్తికి రాకపోకలు నిలిచిపోయాయి. దంతనూరు-శంకరమ్మపేట గ్రామాల మధ్య కాజ్‌వే నీట మునిగి రెండు గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి.

రామన్‌పాడు 2 గేట్లు ఎత్తి..

ఊకచెట్టు వాగుతో పాటు ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతుండటంతో గురువారం రామన్‌పాడు జలాశయానికి 10 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దీంతో అధికారులు 2 గేట్లు ఎత్తి 8 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

మన్యంకొండలో భక్తిశ్రద్ధలతో 'పూర్ణాహుతి'

మహబూబ్‌నగర్ రూరల్: శ్రావణమాస విశేషోత్సవాల ముగింపును పురస్కరించుకొని మన్యంకొండ శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం పూర్ణాహుతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత నెల 25న స్వామివారి విశేషోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో నెల రోజుల పాటు దేవస్థానంలో పలు పూజా కార్యక్రమాలతో పాటు ప్రతిరోజు ప్రత్యేక శాంతిహోమం జరిపిస్తారు. విశేషోత్సవాల సందర్భంగా స్వామివారిని బంగారు ఆభరణాలతో స్వర్ణాభరణ అలంకరణ చేసి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేయి తులసి దళాలతో తులసి నామార్చన చేశారు. ముగింపు వేడుకల సందర్భంగా హనుమద్దాసుల మండపంలో స్వామివారికి పలు పూజలు నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

రాజ్యం మనిషి ప్రాణం కాపాడేదిగా ఉండాలి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాజ్యం మనిషి ప్రాణాలను కాపాడటానికి ఉండాలి కానీ చంపడానికి కాదని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. బుధవారం స్థానిక రెడ్‌క్రాస్ భవన్‌లో కనకాచారి 20వ వర్ధంతి సందర్భంగా కేకే మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కనకాచారి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనకాచారి చాలా కాలం ఉపాధ్యాయ సంఘంలో పని చేస్తూనే సమాజంలోని అసమానతలపై గళం విప్పారన్నారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి తెలంగాణ జనసభలో దీర్ఘకాలం పని చేశారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తిపై ప్రభుత్వం కక్ష సాధింపులో భాగంగా ఆయన్ను హత్య చేయించిందని ఆరోపించారు. ప్రజల స్థితిగతులను చూడాల్సిన ప్రభుత్వాలు దాన్ని ఎప్పుడో విడిచి అదానీ, అంబానీ లాంటి వారికి రాయితీలు ఇస్తూ వారిని మరింత ధనవంతులుగా మారుస్తున్నాయని విమర్శించారు. ఖనిజ సంపదలను వెలికి తీయడానికి అడవులను నరకడం, ఆదివాసులను చంపడం వారి ప్రధాన లక్ష్యంగా మారిపోయిందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా మనలాంటి మేధావులు ఐక్యంగా పోరాడి పేద ప్రజల వైపు నిలబడాలని సాటి మనిషిగా అది మన కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో పాలమూర్ అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారీ, కేకే మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు వామన్‌కుమార్ పాల్గొన్నారు.

పిల్లర్ గుంతలో పడి బాలుడు మృతి


భరత్‌కుమార్ (ఫైల్)

మద్దూరు: భవన నిర్మాణం కోసం తీసిన పిల్లర్ గుంతలో పడి బాలుడు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. పట్టణంలోని కేకే కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద తోటి పిల్లలతో కలిసి ఆడుకోవడానికి వెళ్లిన భరత్‌కుమార్ (5) అదుపుతప్పి భవన నిర్మాణం కోసం తవ్విన గుంతలో పడ్డాడు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ఆ గుంతలో నీరు చేరడంతో ఊపిరాడక బాలుడు మృతి చెందాడు. పనుల మీద బయటకు వెళ్లిన బాలుడి తండ్రి మొగులప్ప వచ్చి వెతుకుతున్న క్రమంలో పిల్లర్ గుంతలో మృతదేహం కనిపించింది. మొగులప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుప్తనిధి పేరుతో మోసం చేశాడని దారుణహత్య


పూడ్చిన మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీసులు

- నెల రోజుల క్రితం హతమార్చి మామిడితోటలో పాతిపెట్టిన నిందితులు
- మైలారం రంగస్వామి మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు
- ఆరుగురి అరెస్టు

బల్మూర్: తనవద్ద ఉన్న గుప్తనిధి ఇస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తిని దారుణంగా హతమార్చి.. మామిడితోటలో పాతిపెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. నాగర్‌కర్నూల్ డీఎస్పీ బి.శ్రీనివాస్ వివరాల మేరకు.. కోడేరు మండలం మైలారం గ్రామానికి చెందిన రంగస్వామి(39), బల్మూర్ మండలం మైలారం గ్రామానికి చెందిన పులేందర్‌గౌడ్‌కు భూమి కొనుగోలు సందర్భంలో ఆరు నెలల క్రితం పరిచయమైంది. ఈ క్రమంలో రంగస్వామి తన వద్ద గుప్తనిధి ఉందని.. తనకు రూ.5 లక్షలు ఇస్తే ఇస్తానని చెప్పడంతో పులేందర్‌గౌడ్ ఆ మొత్తాన్ని చెల్లించాడు. అయితే నెల రోజులైనా గుప్తనిధి (బంగారం) ఇవ్వకపోవడంతో పాటు మరో రూ.5 లక్షలు ఇస్తేనే ఇస్తానని.. లేనిచో స్వామీజీ మహిమకు భస్మం అవుతారని చెప్పడంతో కక్ష పెంచుకున్న పులేందర్‌గౌడ్.. తనను మోసం చేసిన రంగస్వామిని ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకున్నాడు.

పక్కా ప్లాన్ ప్రకారం..

గతనెల 29న రంగస్వామిని దావత్ పేరుతో జడ్చర్లకు పిలిచిన పులేందర్‌గౌడ్.. మరో ఐదుగురితో కలిసి అక్కడి నుంచి అల్లీపూర్‌కు చేరుకొని విందు ఏర్పాటు చేశాడు. అక్కడ రంగస్వామి తినే చికెన్, కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలిపారు. అతడు మత్తులోకి జారుకున్న తర్వాత వాహనంలో మైలారం గ్రామ సమీపంలోని దేవేందర్ అనే వ్యక్తి మామిడి తోటకు తీసుకొచ్చి గడ్డపారతో తలపై బలంగా మోది హతమార్చారు. అనంతరం అక్కడే గోతి తీసి పాతిపెట్టారు. ఈ క్రమంలో తన భర్త హైదరాబాద్ వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లి నాలుగు రోజులు గడుస్తున్నా తిరిగి రాలేదని రంగస్వామి భార్య అరుణ ఈ నెల 4న కోడేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. మృతుడి ఫోన్‌కాల్ డేటా ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించడంతో చేసిన నేరం అంగీకరించినట్లు డీఎస్పీ వెల్లడించారు. గురువారం ఘటనా స్థలాన్ని నాగర్‌కర్నూల్ డీఎస్పీ బి.శ్రీనివాస్, కొల్లాపూర్ సీఐ మహేశ్, ఎస్‌ఐలు జగదీశ్, రాజేందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి అక్కడే పోస్టుమార్టం చేయించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా, ఈ హత్య కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ప్రధాన నిందితుడైన పులేందర్‌గౌడ్ గతంలో పెద్దకొత్తపల్లి మండలం నక్కలపల్లిలో ఓ వ్యక్తిని హత్య చేసిన కేసు, నల్లగొండ జిల్లా డిండి వద్ద జరిగిన జంట హత్య కేసుల్లో నేరస్తుడని వెల్లడించారు. కాగా. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.


రంగస్వామి (ఫైల్)

మళ్లీ కనిపించిన చిరుత


టీడీగుట్ట మీద గుండుపై చిరుత

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పాలమూరు పట్టణ ప్రజలను చిరుత బెంబేలెత్తిస్తోంది. పదిహేను రోజులుగా ఎక్కడా కనిపించకపోవడంతో పోయివుంటదిలే అనుకున్న వెంటనే మెరుపులా ఎక్కడోచోట కనిపించి కలవర పెడుతోంది. రెండు నెలలుగా భయాందోళనకు గురిచేస్తున్న చిరుత తరచుగా గుట్టపై నుంచి డంపింగ్ యార్డు వైపు వెళుతూ ఒకే కెమెరాలో 4 సార్లు కనిపించడం ఆందోళనకు గురిచేస్తోంది. అటువైపు వెళ్లిన చిరుత మళ్లీ అదేదారిలో రావడంలేదు. ఏ ఒక్క కెమెరాలోనూ కనిపించడంలేదు. కోయిలకొండ క్రాస్‌రోడ్డు సమీపంలో గుట్టపై పాత డంపింగ్‌యార్డు సమీపంలో అమర్చిన ఈ ట్రాప్ కెమెరాలోనే 4సార్లు కనిపించినా సమీపంలో ఉన్న బోనుకు మాత్రం చిక్కకుండా తప్పించుకు తిరుగుతోంది. చిరుత డంపింగ్‌యార్డు వైపు వెళుతున్న క్రమంలో గతనెల 22న సాయంత్రం 6:50 గంటలకు, ఈ నెల 1న రాత్రి 8:48 గంటలకు, 10న తెల్లవారుజామున 3:49 గంటలకు, మళ్లీ ఈనెల 24న రాత్రి 11:05 గంటలకు కనిపించింది. అటు వైపుగా వెళ్తున్న చిరుత మళ్లీ ఏ కెమెరాకు కంటపడకుండా వెనక్కి రావడం గమనార్హం. ఈనెల 10న ట్రాప్ కెమెరాలో కనిపించిన చిరుత మళ్లీ 15రోజుల వరకు ఏ కెమెరాలో కనిపించక పోవడంతో ఇటీవల సెర్చ్ బృందాలను రద్దు చేశారు. ఆ పరిధి బీట్ ఆఫీసర్‌తోపాటు సెక్షన్ ఆఫీసర్ ఇద్దరు మాత్రమే ఈ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తున్నారని విశ్వసనీయ సమాచారం. తాజాగా గురువారం మధ్యాహ్నం టీడీగుట్ట మీద గుండుపై చిరుత కనిపించడం కలకలం రేపింది. గతంలోనూ లైవ్‌గా తరచుగా పలుమార్లు చిరుత కనిపించిన విషయం తెలిసిందే. వీరన్నపేట, టీడీగుట్ట, డంపింగ్ యార్డు ప్రాంతాల్లో మొత్తం 20 ట్రాప్ కెమెరాలు, 4 లైవ్ కెమెరాలు, 4బోన్‌లను ఏర్పాటు చేశారు.

వీడియో వైరల్

ఎంత ప్రయత్నించినా బోనుకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న చిరుత తిర్మల్‌దేవునిగుట్ట మీద గుండుపై మళ్లీ కనిపించింది. గురువారం మధ్యాహ్నం టీడీగుట్ట హైస్కూల్ ఎదురుగా గుట్టపై ఉన్న గుండు మీద తిరుగుతూ కనిపించిన చిరుత వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. స్థానికుల సమాచారం మేరకు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అబ్దుల్ హాయ్ ఆధ్వర్యంలో చిరుత సంచరించిన ప్రాంతానికి వెళ్లిన ఫారెస్టు బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ సర్చ్ ఆపరేషన్ కొనసాగించినా ఫలితం లేకపోయింది. చిరుత సంచారంతో రెండు నెలలుగా టీడీగుట్ట, వీరన్నపేట, కోయిలకొండ క్రాస్‌రోడ్డు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఎప్పుడు ఎక్కడ చిరుత దాడి చేస్తుందోననే భయాందోళనతో గడుపుతున్నారు. ఒకవైపు నాలుగు బోన్‌లు, 20 ట్రాప్ కెమెరాలు, 4 లైవ్ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో ఆపరేషన్ కొనసాగిరచినా చిరుత మాత్రం తప్పించుకు తిరుగుతుంది. సెర్చ్ బృందాల కళ్లు గప్పి అప్పుడప్పుడు గుట్టపై ఉన్న గుండ్లపై తిరుగుతూ కనిపించడం కలకలం రేపుతోంది. ఒకసారి కనిపించిన చిరుత మళ్లీ వారానికో, పదిరోజులకో కనిపిస్తూ స్థానికులను బెంబేలెత్తిస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.